

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

తోటపల్లి దేవస్థానానికి ఆనుకుని నాగావళి తీరంలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణా విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టడం వల్ల నది ప్రాంతంలో భారీ గుంతలు ఏర్పడ్డాయి. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. నదిలో స్నానాలు చేయలేకపోతున్నారు. వరదల సమయంలో దేవస్థానానికి కూడా ముప్పు పొంచి ఉంది. ఇసుక అక్రమ రవాణాపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

- వీవీ సూర్యనారాయణ, ఈవో,
తోటపల్లి దేవస్థానం

తవ్వేస్తున్నారు!

● అనుమతులు లేకుండానే ఇసుక అక్రమ రవాణా ● యథేచ్ఛగా ఇతర ప్రాంతాలకు తరలింపు ● తోటపల్లి ప్రాజెక్టుకు పొంచి ఉన్న ముప్పు



తోటపల్లి ప్రాజెక్టు పరిధి నాగావళి తీరంలో ఇసుక తవ్వకాలు జరుపుతున్న దృశ్యం

గరుగుబిల్లి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధి నాగావళి నదీ తీర ప్రాంతంలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండానే ట్రాక్టర్లతో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రధాన రహదారికి ఆనుకుని ప్రాజెక్టు ఉండడంతో అక్రమ రవాణాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. దీనిపై పట్టించుకునే వారే కరువవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. గతంలో పాత రెగ్యులేటర్‌కు ఆనుకుని ఇసుక రవాణా చేసేవారు. ప్రస్తుతం పాత రెగ్యులేటర్‌ను తొలగించిన తర్వాత వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి దిగువ ప్రాంతంలో అధికంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. దీంతో నదీ ప్రాంతంలో భారీ గుంతలు ఏర్పడ్డాయి. అనుకోకుండా వాటిల్లో దిగి ఇప్పటికే ఎంతోమంది మృత్యువాత పడ్డారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు కూడా నదిలో పుణ్య స్నానాలు చేయలేని పరిస్థితి ఏర్పడింది. గతంలో విశాఖకు చెందిన ఒకే కుటుంబానికి నలుగురు నదీ తీరంలో గుంతల్లో కూరుకుపోయి ప్రాణాలు కోల్పోయారు. దీంతో తోటపల్లి దేవస్థానం అక్కడ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసింది. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా దేవస్థానం అప్రమత్తంగా ఉన్నా ఇసుకాసురులు మాత్రం ఏ మాత్రం తగ్గడం లేదు. జోరుగా తమ దందా కొనసాగిస్తున్నారు.



ఇసుక తవ్వకాలతో నదీ ప్రాంతంలో ఏర్పడిన గుంతలు

రీచ్‌లు లేకపోయినా..

మండలానికి సంబంధించి ప్రభుత్వపరంగా ఇసుక రీచ్‌లు లేకపోయినా.. తరలింపు ఆగడం లేదు. గతంలో తోటపల్లి, చిలకాం, నరాగూరు, సాంబన్నవలస రీచ్‌లను గుర్తించారు. అయితే ఈ ప్రాంతంలో నిబంధనల మేరకు ఇసుక నిల్వలు లేవని భూగర్భ గనులశాఖ అధికారులు అనుమతులు మంజూరు చేయలేదు. అయినప్పటికీ నాగావళి నదీ తీరంలో ఇసుక తరలింపు ఆగడం లేదు. ప్రస్తుతం ప్రాజెక్టుకు సమీపంలో ఏ మూల చూసినా భారీ గుంతలు దర్శనమిస్తున్నాయి. గుంతలను చూసి పరిసర ప్రాంతాలకు చెందిన వారు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలాఉండగా దేవస్థానం, పాఠశాలలు అభివృద్ధి నెపంతో ఇసుక తరలింపును తరలించుకుపోయి కొందరు కాసులు వెనుకేసుకుంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి.. యథేచ్ఛగా సాగుతున్న ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని భక్తులు, పరిసర ప్రాంతవాసులు కోరుతున్నారు.



ఉత్కంఠకు తెర పడనుందా?

● నేడు మరోసారి పాలకొండ చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియ

పాలకొండ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పాలకొండ నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఎన్నికపై ఉత్కంఠ కొనసాగుతుంది. గత నెలలో వరుసగా రెండు రోజులు నగర పంచాయతీలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అయినా కౌన్సిల్ సభ్యులు ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. ఈ వ్యవహారాన్ని సబ్ కలెక్టర్ యశ్వంత్ కుమార్‌రెడ్డి ఎన్నికల సంఘానికి వివరించారు. దీంతో ఈ నెల 17న మరోసారి చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియ చేపట్టాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో సోమవారం చైర్‌పర్సన్ ఎన్నికకు సంబంధించి మరోసారి కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నారు. అయితే ఈ ఎన్నికకు సంబంధించి టీడీపీ ఎత్తులకు పైఎత్తులు వేస్తుండగా, వైసీపీ కూడా పరువు నిలుపుకోవాలనే ఆలోచన ఉన్నట్టు తెలుస్తోంది. నగర పంచాయతీపై టీడీపీ జెండా ఎగురవేయాలని ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎమ్మెల్యే జయకృష్ణ పావులు కదుపుతున్నారు. మరోవైపు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సైతం దృష్టి పెట్టినట్టు వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. ఎవరిది పై చేయి అవుతుందో వేచిచూడాల్సి ఉంది.

విద్యా వ్యవస్థ పటిష్ఠం!

● గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు
● పెరగనున్న హైస్కూళ్లు
● పాఠశాలల విలీనంలో మార్పులు, చేర్పులకు కసరత్తు





పార్వతీపురం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ సర్కారు పాలనలో జీవో నెంబర్ 117తో దారి తప్పిన విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ మేరకు పాఠశాలల విలీనంలో చేర్పులు, మార్పులకు కసరత్తు చేయాలని అధికారులను ఆదేశా లిచ్చింది. నూతన విద్యా విధానంలో భాగంగా ఇదివరకు ఉన్నత పాఠశాలలో విలీనమైన మూడు, నాలుగు, ఐదు తరగ తులను వెనక్కి తీసుకొచ్చి ప్రాథమిక విద్యకు ఊపిరిపోయనుంది. పంచాయతీకి ఒక ప్రాథమిక పాఠశా లను మోడల్ ప్రైమరీ స్కూల్‌గా మార్చనుంది. ఈ ఏడాది జూన్ నుంచి ప్రారంభమయ్యే విద్యా సంవ త్సరంలో ఐదు రకాల బడుల విధానం అమలు చేయబోతున్నారు. మొత్తంగా విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

● గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో ఒకటి నుంచి రెండు తరగతుల వరకు 90 పాఠశాలలు ఉండేవి. ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు 857 పాఠశాలలు, ప్రైమరీ హైస్కూల్స్ అంటే మూడు నుంచి ఎనిమిది తరగతుల వరకు 79 బడులు ఉండేవి. హైస్కూల్స్ ఆరు నుంచి పదో తరగతుల వరకు 39 ఉండేవి. ఒకటి నుంచి 10వ తరగతి వరకు 61 పాఠశాలలు , ఆరు నుంచి 12వ తరగతి వరకు ఐదు పాఠశాలలు ఉండేవి. మొత్తం జిల్లాలో 1,131 పాఠ శాలలు ఉండేవి. మార్పులు, చేర్పులు తర్వాత పాఠశాలల సంఖ్య 1140కు చేరనుంది.

● కొత్త విధానం ద్వారా ఒకటి తరగతి నుంచి రెండు తరగతుల వరకు 252 జిల్లాలో ఫౌండేషన్ స్కూల్స్ ఏర్పాటు కానున్నాయి. బీపీఎస్ పాఠశాలలు 507, ఎంపీఎస్ బడులు 267 , హైస్కూల్స్ 114 స్కూళ్లు ఏర్పాటు కానున్నాయి. మొత్తంగా కొత్త విద్యా విధానం ద్వారా జిల్లాలో 1140 పాఠశాలలు ఏర్పడే అవకాశం ఉంది.

● గత వైసీపీ ప్రభుత్వ పాలనలో.. 30 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండేవారు. 60 మందికి ఇద్దరు టీచర్లు ఉండేవారు. కాగా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం 60 మంది విద్యార్థులకు ఐదుగురు ఉపాధ్యాయులను కేటాయిస్తోంది.

ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు..

● పంచాయతీ కేంద్రాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో ఎక్కడైతే 60 మంది కంటే ఎక్కువ పిల్లలు ఉన్నారో.. ఆ స్కూల్‌ను ఆదర్శ ప్రాథమిక పాఠశాల (మోడల్ ప్రైమరీ స్కూల్)గా (మిగతా 8వ పేజీలో...)

డీఎస్సీలో ఎస్టీలకు న్యాయం చేయాలి 8లో
● ఆదివాసీ జిల్లా జేఏసీ డిమాండ్

జేఎన్‌టీయూలో 18 నుంచి వర్క్‌షాప్ 7లో

నరసింహస్వామికి అరటి గెలల నివేదన

ఘనంగా తీర్థ మహోత్సవాలు
● ఉత్సాహంగా ఎడ్ల బండ్ల గుర్రాల పరుగు పోటీలు 7లో

సంచార పశు వైద్యసేవలకు బ్రేక్
● వాహనాలను అసిస్టెంట్ డైరెక్టర్లకు అప్పగించాలని ప్రభుత్వ ఆదేశం



టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

● కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



పార్వతీపురం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సూచించారు. 'మై స్కూల్.. మై ప్రైడ్'పై హెచ్‌ఎం, టీచర్స్‌తో కలెక్టర్ ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంతో చదివేలా చూడాలన్నారు. ఏటాలానే ఈ సారి కూడా పదో తరగతి ఉత్తీర్ణత శాతంలో రాష్ట్రస్థాయిలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. పాఠ్యాంశాలపై ప్రతి విద్యార్థి సంపూర్ణ విజ్ఞానం కలిగి ఉండేలా చేయడమే మైస్కూల్.. మైప్రైడ్ ఉద్దేశమన్నారు. టెన్త్ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచడం కోసమే దీనిని రూపొందించామన్నారు. అన్ని తరగతుల వారు కూడా క్రీడలు, వ్యాసరచనలు, చర్చలు, సైన్స్ ఫెయిర్లలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. టెన్త్ విద్యార్థులు సబ్జెక్టులపై పూర్తి అవగాహన పెంపొందించి.. వారి సందేహాలను నివృత్తి చేయాలన్నారు. చదువులో వెనుకబడిన వారిని గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. తొలుత పాఠ్యాంశాలపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టాలన్నారు. పదో తరగతి అనంతరం ఉపాధి అవకాశాలు లభించే కోర్సులపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో ఉప విద్యాశాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిలో ఏనుగులు

కొమరాడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా గరుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాల్లో హల్‌చల్ చేసిన ఏనుగులు ఆదివారం కొమరాడ మండలంలోని దుగ్గి గ్రామానికి చేరుకున్నాయి. దీంతో సమీప ప్రాంత ప్రజలు హడలెత్తిపోతున్నారు. వాస్తవంగా రైతులంతా వ్యవసాయ పనుల్లో బిజీగా గడిపారు. అయితే ఏనుగుల గుంపు రావడంతో వీరంతా ఆందోళన చెందుతున్నారు. వాణిజ్య పంటలైన అరటి, మొక్కజొన్న, పుచ్చకాయతో పాటు కూరగాయల పంటలను గజరాజులు నాశనం చేయనున్నాయని రైతులు వాపోతున్నారు. తక్షణమే ఈ ప్రాంతం నుంచి వాటిని తరలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా అటవీ శాఖాధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో పంట పొలాల్లోకి రైతులు వెళ్లరాదని సూచిస్తున్నారు.





8లో

నిర్వహణ లేక..

సాగు నీరందక

● షట్టర్లు పాడై..
ఇసుక మేటలు వేసిన వైనం
● డిజైన్ లోపంతో కుడి, ఎడమ కాలువల ద్వారా అందని నీరు
● శిథిలావస్థలో మదుములు
● ఇదీ ఏడొంపులగెడ్డ ఆనకట్ట పరిస్థితి

ఎట్టకేలకు ఫీజు రీయింబర్స్‌మెంట్

● బకాయిలతో పాటు ఈ విద్యాసంవత్సర నిధులూ విడుదల

రాజాం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు గుడ్‌న్యూస్. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను కూటమి ప్రభుత్వం విడుదల చేసింది. ఇందుకు సంబంధించి ఉత్తర్వులు కూడా ఇచ్చింది. పాత బకాయిలతో పాటు ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి ఉమ్మడి జిల్లాలో వేలాది మంది విద్యార్థులకు నిధులు విడుదల చేసింది. అవి కళాశాలల యాజమాన్యాల ఖాతాల్లో పడుతున్నాయి. ఎస్టీ విద్యార్థులకు శతశాతం నిధులు విడుదల చేయగా.. ఎస్సీ విద్యార్థులకు 40 శాతం..బీసీ విద్యార్థులకు 25 శాతం విడుదల చేసింది. మరో రెండు విడతల్లో మిగిలిన బకాయిలతో పాటు ఈ ఏడాదికి సంబంధించిన ఫీజు జమ చేయనున్నట్టు అధికారులు చెబుతున్నారు.

గత ఐదేళ్లలో..

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించక భారీగా పేరుకుపోయింది. విద్యాదీవెన, వసతి దీవెన పథకాలకు సంబంధించి కోట్లాది రుపాయల బకాయిలు ఉన్నట్టు తెలుస్తోంది. ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ, ఇతర వృత్తిపరమైన కోర్సులు చదువుకున్న వారికి వందశాతం ఫీజును ప్రభుత్వమే చెల్లిస్తుందని అప్పట్లో సీఎం జగన్ ప్రకటించారు. కానీ అమలు చేయడంలో విఫలమయ్యారు. అది పేద విద్యార్థులకు శాపంగా మారింది. కళాశాలల యాజమాన్యాల నుంచి ఒత్తిడి పెరుగుతుండడంతో ప్రస్తుతం తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు కడుతున్నారు. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా ఫిర్యాదులు వస్తుండడంతో విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. జగన్ ప్రవేశపెట్టిన దీవెనల స్థానంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్ రీయింబర్స్‌మెంట్ పథకాలను ఏర్పాటుచేశారు. ప్రాధాన్యతాక్రమంలో పెండింగ్ బిల్లులు విడుదల చేస్తున్నారు.



సంచార పశు వైద్యసేవలకు బ్రేక్

● వాహనాలను అసిస్టెంట్ డైరెక్టర్లకు అప్పగించాలని ప్రభుత్వ ఆదేశం





మంత్రి అచ్చెన్నాయుడును కలిసిన సంచార వాహన సిబ్బంది

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పశువులకు వైద్యం అందించేందుకు ఏర్పాటు చేసిన సంచార వాహన సేవలను ప్రభుత్వం నిలిపివేసింది. ఆదివారం నుంచి వాహనాలను నిలిపివేయాలని ఉత్తర్వులు విడుదలయ్యాయి. దీంతో పశు వైద్య సేవలకు అంతరాయం కలగనుంది. తొలివిడతగా ఏర్పాటు చేసిన వాహనాలను ఆపివేయాలంటూ ఆదేశాలు వచ్చాయి. దీంతో వాహనాలను నిర్వహించే సిబ్బందిని జీవీకే సంస్థ తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సంబంధిత వాహనాలను ఆయా నియోజకవర్గాల పరిధిలో ఆ నియోజకవర్గానికి చెందిన పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్లకు అప్పగించాలంటూ ఆదేశాలు వచ్చాయి. దీంతో ఆ ఉద్యోగులు పరిస్థితి ఆయోమయంలో పడింది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 2022 మే 19న తొలిదశ కింద జిల్లాలో 7 వాహనాలను ప్రారంభించారు. ఇందులో వీటి నిర్వహణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం వాటా 60 శాతం కాగా, మిగిలిన 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంది. ఇందులో పైలట్, పారావేట్, డాక్టర్ విధులు నిర్వహించేవారు. దీనికోసం ప్రత్యేకంగా 1962 అనే టోల్ ఫ్రీ నెంబరును కూడా ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా పశువులకు వైద్యానికి తీసుకువెళ్లే అవకాశం లేకపోతే, ఈ వాహనంలో ఎక్కించి సంబంధించిన ఆసుపత్రులకు తీసుకువెళ్లేవారు. చిన్న చికిత్సలను వాహనంలోనే నిర్వహించేవారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున తొలిసారి వాహనాలను కేటాయించారు. రెండో విడత 2023 ఫిబ్రవరి 18న నియోజకవర్గానికి అదనంగా మరో వాహనం కేటాయించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు మొత్తం 13 వాహనాలను సమకూర్చారు. వాటి సాయంతో ఇప్పటి వరకూ పశు వైద్య సేవలు బాగానే అందేవి. అయితే ఈ వాహనాల నిర్వహణ బాధ్యత ఓ ప్రైవేట్ సంస్థకు అప్పట్లో అప్పగించడం జరిగింది. ప్రతి రెండేళ్లకు ఒకసారి సంస్థ రెన్యువల్ కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేయాలి. తొలుత ప్రారంభించిన వాహనాలకు గతేడాది మే 18తో గడువు ముగిసింది. రెండో విడత మంజూరు చేసిన వాహనాలకు ఈనెల 17తో రెండేళ్ల గడువు పూర్తయింది. ఈ నేపథ్యంలో వాహనాలను రెన్యువల్‌ను జరగలేదు. దాంతో ఈ నెల 28లోగా వాహనాలను సంబంధించిన అసిస్టెంట్ డైరెక్టరుకు అప్పగించాల్సి ఉంది. ఈనేపథ్యంలో వాహనాల్లో పనిచేస్తున్న సిబ్బంది రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధకశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కలిసి సమస్యలను విన్నవించుకున్నారు.

● ఇదే విషయమై పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ వై.వి.రమణ వద్ద ప్రస్తావించగా.. ప్రస్తుతం ఉన్న వాహనాలను సంబంధించిన అసిస్టెంట్ డైరెక్టర్లకు అప్పగించాలని ఆదేశాలు వచ్చాయన్నారు. ఉత్తర్వుల మేరకు ఏడీలకు వాహనాలను అప్పగించాల్సి ఉందన్నారు. ఆ తర్వాత ప్రభుత్వం ఆదేశాల మేరకు చర్యలు చేపడతామన్నారు.

జేఎన్‌టీయూలో 18 నుంచి వర్క్‌షాప్

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్‌టీయూ వర్సిటీలో ఈ నెల 18 నుంచి రెండు రోజుల పాటు ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. వర్సిటీ వీసీ డాక్టర్ రాజ్యలక్ష్మి, ఎన్ఎస్‌టీఎల్ రిటైర్డ్ సైంటిస్ట్ పి.త్రిమూర్తులు హాజరుకానున్నారని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు.

19 నుంచి సంగీత కార్యక్రమాలు

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కొత్తపేట ఆర్య సోమయాజుల కాశీపతిరావు మెమోరియల్ భవనంలో ఈనెల 19 నుంచి 23 వరకు వివిధ సంగీత కార్యక్రమాలను నిర్వహించనున్నామని ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అధ్యక్ష, కార్యదర్శులు ధవళ సర్వేశ్వరరావు, మండపాక రవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకూ వీణ, మృదంగం, గానం, లలితా సంగీత విభావరి తదితర కార్యక్రమాలను నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో రానున్న విద్యా సంవత్సరానికి ఐదోతరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం (ఇంగ్లీషు మీడియం) ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ కె.ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు మార్చి 6 లోగా సమర్పించాలని సూచించారు.

'ప్రజా సేవకుడిగా ఉంటా..'



బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌వర్మ

గుర్ల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాసేవకుడిగా ఉంటానని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌వర్మ అన్నారు. ఆదివారం మండలంలోని పల్లిగండ్రేడులో ఆయన విలేకరులతో మాట్లాడుతూముఖ్యంగా జిల్లా స్థాయిలో అన్ని గ్రామాల్లో తాను పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకుంటామన్నారు. రైతులకు సంబంధించిన ప్రధాన సమస్యలను సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యంతో పాటు చీపురుపల్లి నియోజకవర్గంలో పారిశ్రామికవాడ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు.కూటమి నాయకుల సహకారంతో జిల్లాలో అభివృద్ధి జరిగేందుకుపనిచేస్తానన్నారు.

ఎస్పీని కలిసిన మక్కా

రాజాం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా ఎస్పీ మహేశ్వరరెడ్డిని ఆదివారం తూర్పుకాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మక్కా సాయిబాబానాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో తూర్పుకాపులు సమస్యలను పరిష్కరించి తగు న్యాయం చేయాలని మక్కా కోరారు.

112 మందికి నేత్ర పరీక్షలు

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డవరలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరం లో 112 మందికి పరీక్షలు జరిగాయి. బొడ్డవర ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటైన శిబిరంలో శంకర్ ఫౌండేషన్ వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించారని వాసవీ సంఘం అధ్యక్షుడు పి.సత్యనారాయణ, వాసవీ మహిళా సంఘ అధ్యక్షురాలు పూసర్లకోటి రత్నం తెలిపారు.

● రాజాం: పట్టణంలోని సత్యం సేవా మందిరంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర శిబిరంలో శంకర్ ఫౌండేషన్ వైద్య సిబ్బంది 65 మందికి పరీక్షలు నిర్వహించారు. అందులో 35 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో సేవా మందిరం కన్వీనర్ కొనపల బసవరాజు, పెంకి చైతన్యకుమార్, సేవా కమిటీ సభ్యులు వీరభద్రులు, కార్తీక్, వెంకటేశ్, మల్లేశ్ ఆసుపత్రి సిబ్బంది ఉష, సాయికుమార్, సతీష్, పైడిరాజు పాల్గొన్నారు.



నేత్ర పరీక్షలుచేస్తున్న దృశ్యం

ఘనంగా శివలింగం ప్రతిష్ఠోత్సవం



ఆలయ శిఖరంపై వేదపండితుల పూజలు

కొత్తవలస, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కొత్తవలసలోని ఉమారాలింగేశ్వర ఆలయంలో ఆదివారం శివలింగం ప్రతిష్ఠోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేద పండితుడు అంపోలు ఉమామహేశ్వర శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నర్మదా నదీపరీవాహక ప్రాంతమైన ఓంకారేశ్వరం నుంచి తీసుకువచ్చిన శివలింగాన్ని ఇక్కడ ప్రతిష్ఠించారు. అనంతరం వినాయకుడు, పార్వతీదేవి, నందీశ్వర విగ్రహాలను ప్రతిష్ఠోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతరం శివ పార్వతులకు కల్యాణోత్సవం జరిపించారు. కార్యక్రమంలలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, గొరపల్లి శివ, కోళ్ల వెంకటరమణ, బొబ్బిలి అప్పారావు, కనకాల శివ, కోళ్ల రమణమ్మ, సర్పంచ్ నెక్కల గౌరునాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నరసింహస్వామికి అరటి గెలల నివేదన



పందిళ్లకు వేలాదీసిన అరటి గెలలు

రాజాం రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నరసింహపురంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి, రాముల వారి సంబరాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. రెండేళ్ల తర్వాత నిర్వహించిన వేడుకల్లో పెద్దఎత్తున గ్రామస్థులు పాల్గొన్నారు. వారంతా సంప్రదాయం ప్రకారం పెద్ద పందిళ్లు వేసి పందిళ్లకు అరటిపండ్ల గెలలు కట్టి పూజలు చేశారు.

ఘనంగా తీర్థ మహోత్సవాలు

●ఉత్సాహంగా ఎడ్ల బండ్ల, గుర్రాల పరుగు పోటీలు



ఎడ్ల బండ్ల పోటీల దృశ్యం

వేపాడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లబిల్లిలో భ్రమరాంబిక సహిత మల్లికార్జున స్వామి తీర్థ మహోత్సవాలను ఆదివారం రెండోరోజూ ఘనంగా నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడ్ల బండ్ల పరుగు పోటీలు ఉత్సాహంగా సాగాయి. సాయంత్రం గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా వల్లంపూడి ఎస్ఐ బి.దేవి బందోబస్తు ఏర్పాటు చేశారు.

●లక్కవరపుకోట: మండలంలోని రంగారాయపురం లో మరిడిమాంబ తీర్థ మహోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన గుర్రపు పందేలు అందరినీ ఆకట్టు కున్నాయి. 12 గుర్రాలు పందెంలో పాల్గొన్నాయి. విజేతలకు జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావు, గ్రామ పెద్దలు కాశీవిశ్వనాథ్, రాజు తదితరులు బహుమతులు ప్రదానం చేశారు.



రంగారాయపురంలో గుర్రాల పరుగు

పన్నులు రద్దు చేయండి



మాట్లాడుతున్న వామనమూర్తి

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): టాటా మేజిక్, ఆటో, పాసింజర్ వ్యాన్లపై గ్రీన్ టాక్స్, లేబర్ టాక్స్‌లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఏపీ ఆటో మోటార్ వర్క్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం అమర్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 24 నుంచి జరగనున్న శాసనసభ సమావేశాల్లో ఆటో డ్రైవర్లు, మోటారు కార్మికులకు ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ నేతలు బుగత అశోక్, రంగరాజు, ఈశ్వరరావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

టీడీపీలో 25 కుటుంబాల చేరిక



టీడీపీలో చేరిన వారితో మంత్రి శ్రీనివాస్

గంట్యాడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్లాం గ్రామానికి చెందిన 25 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో ఆదివారం చేరాయి. క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమక్షంలో బెలమల పార్వతి చింతాడ విశ్వనాథం, పి.అప్పలపైడితల్లి, దేవరాపల్లి రాము, చింతాడ శివ, శేఖర్, మాసాల అప్పలనాయుడు, బాడితమాను గోపి, బి.సూర్యనాయణ, రామకృష్ణ, బి.సురేష్‌తో పాటు పలు కుటుంబాలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్‌నాయుడు, పల్లి వెంకటరావు, పి.సత్యనారాయణ, గుల్లుపల్లి ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

వంశీకి శిక్ష పడాల్సిందే..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

రాజాం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ తప్పు చేశాడు కాబట్టి శిక్ష పడాల్సిందేనని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. ఆదివారం క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి వెనుక వంశీ ఉన్నారని ప్రజలకు తెలుసన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరిపై వంశీ అనుచిత వ్యాఖ్యలు చేసిన విషయాన్ని ప్రజలు గమనించారన్నారు. రూ.100 కోట్లు అవినీతికి పాల్పడిన వంశీపై చట్టప్రకారం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. గతంలో రెచ్చిపోయిన వైసీపీ నాయకులెవరినీ విడిచిపెట్టేదిలేదన్నారు. రాజాం నియోజకవర్గానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, స్టేడియం, పీజీ సెంటర్ మంజూరు చేయాలని సీఎం దృష్టికి తీసుకువెళ్లానన్నారు. ఇప్పటికే రాజాంలో మంజూరైన పాలిటెక్నిక్ కళాశాలలో వచ్చే ఏడాది నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాజాం నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. ఆయనతో పాటు పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

ఉమారామలింగేశ్వరుడికి పూజలు

రాజాం:సంతకవిటి మండలం తాలాడలో ఆదివారం నిర్వహించిన ఉమారామ లింగేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో పాటు కోళ్ల అప్పలనాయుడు, వల్లూరు గణేశ్, గట్టి భాను, సమతం శ్రీనివాసరావు, గురవాన నారాయణరావు, వంగా వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించండి



వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

శృంగవరపుకోట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అర్హులైన న్యాయవాదులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలను కేటాయించాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని ఆదివారం ఎస్.కోట బార్ కౌన్సిల్ న్యాయవాదులు కోరారు. క్యాంప్ కార్యాలయంలో ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు సానుకూలంగా ఎమ్మెల్యే స్పందించారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో సూరిదేముడు, సత్యనారాయణ, త్రిమూర్తులు, దాసు, రామకృష్ణ, రమణమూర్తి, చిట్టిబాబు, రామరావు, దొరబాబు, రాము తదితరులున్నారు.

ప్రత్యేక నిధులు కేటాయించండి

లక్కవరపుకోట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మధ్యాహ్న భోజన నిర్వాహక కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి దేగల అప్పలరాజు కోరారు. మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి ఆదివారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి వినతిపత్రం అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు ఇవ్వాలని, రూ.10 వేల జీతం వచ్చేలా చూడాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలన్నారు. రానున్న బడ్జెట్ సమావేశాలలో భోజన కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

రూ.10 లక్షల సీఎంఆర్‌ఎఫ్ విడుదల

లక్కవరపుకోట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.10 లక్షలు విడుదలయ్యాయనిఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. బాధితులకు సోమవారం చెక్కులు పంపిణీ చేస్తామని ఆమె పేర్కొన్నారు.

అసంపూర్తిగా భవన నిర్మాణాలు

వంగర, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బాగెమ్మపేటలో మూడేళ్ల క్రిందట ప్రారంభించిన గ్రామ సచివాలయం, రైతు సేవాకేంద్రం, వెల్‌నెస్ సెంటర్ నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. గ్రామ సచివాలయానికి రూ. 42 లక్షలు, రైతు సేవా కేంద్రానికి రూ.22.50 లక్షలు, వెల్‌నెస్ సెంటర్‌కు రూ.18 లక్షలు చొప్పున గత ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే ఏడాదిన్నరగా పనుల్లో ఎలాంటి కదలిక లేదు. ఈ విషయం ఏఈ ఆనందరావు వద్ద ప్రస్తావించగా, భవన నిర్మాణాలకు నిధులు విడుదల కావల్సి ఉందన్నారు. నిధులు మంజూరైతు పనుల పూర్తికి చర్యలు చేపడతామన్నారు.



అసంపూర్తిగా నిలిచిన భవనాలు ఇవే

ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొని యువకుడి మృతి

●మరొకరికి గాయాలు

క్రైం న్యూస్

తుని రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొన్న ఘటనలో ఒక యువకుడు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన తుని జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఆదివారం ఉదయం డీమార్ట్ సమీపంలో జరిగిన ఈ దుర్ఘటనలో విజయనగరం జిల్లా విలుపర్తి గ్రామానికి చెందిన దోకాడ రవికుమార్(25), రాంబిల్లి మండలం దిమిలి గ్రామానికి చెందిన నకిరెడ్డి కిల్లాడి అన్నవరం దేవస్థానంపై ఒక పెళ్లికి హాజరై స్వగ్రామాలకు వెళుతున్నారు. ఈ నేపథ్యంలో తుని హైవేపై ఉన్న డీమార్ట్ సమీపంలో ఆగి ఉన్న వ్యాన్‌ను ఢీకొట్టడంతో రవికుమార్(25) అక్కడికక్కడే మృతి చెందగా స్నేహితుడైన కిల్లాడి తీవ్రంగా గాయపడ్డాడు. తుని పోలీసులు గాయ పడ్డ కిల్లాడిని ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తుని సీఐ గీతారామకృష్ణ తెలిపారు.

బైక్ దొంగ అరెస్టు

గుర్ల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బైక్ దొంగను ఆదివారం గుర్ల పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని పెదబూర్లిపేటకు చెందిన బూర్లి పెంటంనాయుడు ఇంటికి ఎదుట నిలిపిన ద్విచక్ర వాహనం ఈనెల 12 చోరికి గురైందని గుర్ల పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు. దాంతో ఎస్ఐ నారాయణరావు కేసు నమోదు చేశారు. కానిస్టేబుల్ రామారావు అందించిన సమాచారం ఆధారంగా గతంలో నేరాలకు పాల్పడిన సున్నపు ఉదయ్‌కుమార్‌ను ఎస్ఐ అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించడంతో బైక్ దొంగిలించినట్టు అంగీకరించాడు. దాంతో బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసును త్వరితగతిన ఛేదించిన గుర్ల ఎస్ఐ నారాయణరావు, కానిస్టేబుల్ వై.రామారావులను చీపురుపల్లి డీఎస్పీ, సీఐ అభినందించారు.

కోడి పందేలపై దాడి

శృంగవరపుకోట రూరల్ ఫిబ్రవరి 16 : మండలంలోని రాజీపేట శివారులో నిర్వహిస్తున్న కోడి పందేలపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. కోళ్లతో పాటు పందెపురాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయంపై సీఐ నారాయణమూర్తి మాట్లాడుతూ రాజీపేట సమీపంలో పందాలు జరుగుతున్నట్టు ఆదివారం సాయంత్రం సమాచారం అందడంతో ఎస్ఐ గంగరాజు తన సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించారన్నారు. ఐదురుగు వ్యక్తులతో పాటు మూడు కోళ్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారన్నారు.

వివిధ గ్రామాల్లో మద్యం పట్టివేత

గజపతినగరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వివిధ గ్రామాల్లో ఆదివారం చేపట్టిన దాడుల్లో మద్యం తరలిస్తూ పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసినట్టు ఎక్సైజ్ ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు. మండలంలోని లింగాలవలసలో అదే గ్రామానికి చెందిన సారిక అప్పలనాయుడు 10 మద్యం సీసాలతో, మదుపాడలో చుక్క అప్పయ్యమ్మ 9 మద్యం సీసాలతో పట్టుబడ్డారన్నారు.

●మెంటాడ: చల్లపేట ఆటోస్టాండ్‌లో జయతి గ్రామానికి చెందిన రామారావును ఆదివారం అదుపులోకి తీసుకుని 14 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఆంధ్ర ఎస్ఐ సీతారాం తెలిపారు. రామారావుపై కేసు నమోదు చేశామన్నారు.

ఎం.కొత్తవలసకు త్వరలో బస్సు సౌకర్యం



హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

గజపతినగరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కొత్తవలస గ్రామానికి త్వరలో ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించనున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టారు. ఈమేరకు ఆదివారం ఆర్టీసీ అధికారులు గ్రామానికి వచ్చి రూట్ మ్యాప్ పరిశీలించారు. ఏయే సమయాల్లో విజయనగరం నుంచి సర్వీసులు తిప్పితే బాగుంటుందనే దానిపై స్థానికులతో మాట్లాడారు. దీంతో లింగాలవలస, ముచ్చర్ల, రంగుపురం, వేమలి, జిన్నాం, ఎం.కొత్తవలస గ్రామాల ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు కరిమజ్జి రామకృష్ణ, గుంట్రోతు గోవింద, ఈశ్వరరావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత పెదసత్యనారాయణ



రజనీకుమారిని సత్కరిస్తున్న జగన్మోహనరావు

చీపురుపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పెదనడిపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, మాజీ సర్పంచ్ దివంగత మన్నె పెదసత్యనారాయణ నేత్రదానంపై వేలాది మందికి స్ఫూర్తిగా నిలిచారని రెడ్‌క్రాస్ సొసైటీ ఏపీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు కొనియాడారు. ఇటీవల పెదసత్యనారాయణ మృతి చెందిన నేపథ్యంలో ఆదివారం ఆయన కుటుంబాన్ని జగన్మోహనరావు కలిశారు. ఆయన సతీమణి మన్నె రజనీకుమారిని రెడ్‌క్రాస్ తరఫున సత్కరించారు. సత్యనారాయణ సర్పంచ్‌గా ఉన్న సమయంలో గ్రామంలో నేత్రదాన ఉద్యమాన్ని నడిపించారన్నారు. ఆయన స్ఫూర్తితో గ్రామంలో ప్రతి ఒక్కరూ నేత్రదానానికి అంగీకారం తెలిపారన్నారు. వివిధ కారణాల వల్ల మరణించిన 32 మందితో నేత్రదానం చేయించి, మరో 60 మందికి చూపునిచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మన్నె ప్రకాశరాయుడు, వెలిచేటి మురళీధర్, మానవీయత సంస్థ అధ్యక్షుడు బీవీ గోవిందరాజులు, ఆదినారాయణ, టెక్నిషియన్ సుజాత, సర్పంచ్ ఎస్.పోలరాజు, వెలిచేటి అలివేలు మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయండి

చీపురుపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అవుట్ సోర్సింగ్ విధానంలో రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అమరావతి జేఏసీ ప్రధాన కార్యదర్శి పి.భానుమూర్తి, జిల్లా అధ్యక్షుడు జి.మహేంద్రబాబు డిమాండ్ చేశారు. ఆదివారం చీపురుపల్లిలో నిర్వహించిన డివిజన్ స్థాయి సమావేశానికి వారు హాజరయ్యారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శ్రీను, ఎల్.శ్రీనివాస్, ఎం.లక్ష్మణరావు, రౌతు రామకృష్ణ, సూర్యానారాయణ, కనకరాజు పాల్గొన్నారు.

శాసన సభాపతుల పుస్తకావిష్కరణ

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి చెందిన రచయిత ఎస్.గురుప్రసాద్ రాసిన ఏపీ శాసన సభాపతులు పుస్తకాన్ని ఆదివారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఆవిష్కరించారు. 1953లో స్పీకర్‌గా సేవలు అందించిన నల్లపాటి వెంకటరామయ్య చౌదరి నుంచి 2024 జూన్‌లో ఎన్నికైన సభా స్పీకర్ చింతకాయల అయన్నపాత్రుడు వరకూ 23 మంది శాసనాసభాపతులు రాజకీయ జీవిత విశేషాలపై రాసిన పుస్తకం బాగుందని ఆమె ప్రశంసించారు.

నాటక కళాపరిషత్ సభ్యుల సమావేశం

గరివిడి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): గరివిడి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గరివిడి నాటక కళాపరిషత్ సభ్యులు ఆదివారం సమావేశమయ్యారు. కళాపరిషత్ ఆధ్వర్యంలో త్వరలో గరివిడిలో నాటకాల పోటీలు నిర్వహించేందుకు చర్చించారు. అందుకుగానూ ఫేకర్ యాజమాన్యానికి సంబంధించిన శ్రీరామ్ హైస్కూల్ వేదికగా నాటకాల పోటీలు నిర్వహించాలని నిర్ణయించారు.

భూ వివాదంలో కొట్లాట

రాజాం రూరల్, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): రాజాం మండలం బొమ్మినాయుడువలసలో ఆదివారం రాత్రి రెండు సామాజిక వర్గాల మధ్య చోటుచేసుకున్న కొట్లాటలో పది మంది గాయపడ్డారు. భూ విషయమై మొదలైన గొడవ కొద్దిసేపటికి ఘర్షణకు దారితీసింది. కొట్లాటలో ఇరువర్గాలకు చెందిన వారు గాయపడ్డారు. వారంతా రాజాం సామాజిక ఆస్పత్రిని ఆశ్రయించారు. పోలీసులు ఆస్పత్రికి వెళ్లి పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. రాత్రి 11.30 గంటల వరకు కేసు నమోదు కాలేదు.

పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలి

● ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మావతి



మాట్లాడుతున్న పద్మావతి

బొబ్బిలి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి):కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో-57ను 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు వర్తింపజేసి వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు బొత్స పద్మావతి డిమాండ్ చేశారు. ఆదివారం బొబ్బిలి ఏపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2003 డిసెంబరు 31కి ముందు అప్పట్లో డీఎస్సీ ప్రకటించినట్లు తెలిపారు. ప్రభుత్వం అలసత్వం వల్ల ఉద్యోగ నియామకాలు 2004లో జరిగాయన్నారు. అలా నియమించిన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంతో వెంటనే దానిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో అమలు కాని మెమోను, కూటమి ప్రభుత్వం కూడా ఇంతవరకు అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. ఏపీటీఎఫ్ అకడమిక్ రాష్ట్ర కన్వీనరు జేసీ రాజు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ప్రభుత్వం పరిష్కరించి అమలు చేయాలన్నారు. మధ్యంతర భృతిని ప్రకటించి, 12వ పీఆర్సీ నియమించాలని, ఆర్థిక బకాయిలు క్లియర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బంకురు జోగినాయుడు, ప్రవీణ్‌కుమార్, సింహాచలం, ఎల్లయ్య, శ్రీను, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



ఆక్రమణకు గురైన చెరువును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

రామభద్రపురం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొట్టక్కి రెవెన్యూ పరిధిలో గల చెరువు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆక్రమణకు గురైన చెరువు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు రికార్డులు మార్చి చెరువులను మాయంచేస్తున్నారని, ఈ వ్యవహారంపై కలెక్టర్ సమగ్రమైన దర్యాప్తు జరిపి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో ఈ చెరువు ఆక్రమణకు గురవుతోందని ఫిర్యాదు చేశామని, అప్పట్లో కేసులు నమోదు చేస్తామని హామీఇచ్చి ఇపుడు రికార్డులు తారుమారు చేయడం అన్యాయమని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్.గోపాల్, బలసా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాడంగిలో 'చదవడం మాకిష్టం'



పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

బాడంగి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి):పుస్తకాలు చదవడం వల్ల జ్ఞానసము పార్జన చేయవచ్చని స్థానిక గ్రంథాలయాధికారి ఆర్.దుర్గప్రసాద్ తెలిపారు. ఆదివారం బాడంగి శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దేశ నాయకులు, నీతి కథలతోపాటు పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు, పత్రికలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

వినతులను పరిష్కరించాలి

● భామిని తహసీల్దార్ అప్పారావు

భామిని, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులను పరిష్కరించి,ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని తహసీల్దార్ ఎం.అప్పారావు వీఆర్వోలకు సూచించారు. ఆదివారం భామిని తహసీల్దార్ కార్యాలయంలో వినతులను ఆన్‌లైన్ చేయించారు. ఈసందర్భంగా అప్పారావు రైతులు ఇచ్చిన అర్జీలకు పరిష్కారానికి పొంతనలేకపోవడంపై ప్రశ్నించారు. వినతులకు సంబంధించి బృందాలుగా ఏర్పడి సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. మండలానికి 1,794 వినతులు రాగా, 1,026 పరిష్కారమయ్యాయని చెప్పారు. 768 దరఖాస్తులు పరిశీలించి పరిష్కరిస్తున్నామని డీటీ రాయుడు తహసీల్దార్‌కు తెలిపారు.



సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దార్ అప్పారావు

అడవులను రక్షించుకోవాలి

● జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి



మాట్లాడుతున్న సరస్వతి మాఝి

రాయగడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అడవులను రక్షించుకోవాలని జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి పిలుపునిచ్చా రు. ఆదివారం రాయగడ ఫారెస్ట్ పార్క్‌లో రేంజర్ కామేశ్వర ఆచారి అధ్యక్షతన అడవిలో మంటల నివారణ ప్రజల బాధ్యత అన్న అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వనవిహార యాత్రకు వెళ్లేవారు వంటలు చేసుకుని నిర్లక్ష్యంగా వ్యవహరించడం, సిగరెట్లు కాల్చి ఆర్పివేయకుండా పడవేయడం వల్ల మంటలు వ్యాప్తిచెంది అడవులు అంటుకున్నాయని, ఈ విషయంలో అటవీఅధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాయగడ సమితి అధ్యక్షురాలు టునిహాయిక మాట్లాడుతూ అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవిస్తున్న గిరిపుత్రుల్లో చైతన్యం కలిగించాలన్నారు. రేంజర్ కామేశ్వర ఆచారి మాట్లాడుతూ అడవుల పెంపకంపై దృష్టి సారించామని, ప్రతి పంచాయతీలో మొక్కలు పంపిణీచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి రమేష్‌చంద్ర బెహరా, సర్పంచ్‌లు, ఫారెస్ట్ గార్డులు పాల్గొన్నారు.

నిర్వహణ లేక.. సాగు నీరందక

● షట్టర్లు పాడై.. ఇసుక మేటలు వేసిన వైనం ● డిజైన్ లోపంతో కుడి, ఎడమ కాలువల ద్వారా అందని నీరు ● శిథిలావస్థకు చేరిన మదుములు ● ఇదీ ఏడొంపులగెడ్డ ఆనకట్ట పరిస్థితి



డిజైన్ లోపంతో నిర్మించడం వల్ల నీరు నిల్వఉండని ఆనకట్ట ఇదే

రామభద్రపురం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఏడొంపులగెడ్డ ఆనకట్ట నిర్వహణ నీరుగారుతోంది. నిర్వహణ, డిజైన్ లోపం పుణ్యమాని ఆయకట్టుకు నీరందడంలేదు.షట్టర్లు పూర్తిగా పాడవడంతోపాటుఇసుక మేటలువేసింది. కుడి, ఎడమ కాలువలు పూర్తిగా మూసుకుపోయాయి.

మండలంలోని కొండకెంగువ వద్ద కొండలపై నుంచి వచ్చే నీటిని నిల్వచేసి ఆయకట్టుకు నీరందించేందుకు ఆనకట్ట నిర్మించాలని అప్పట్లో ఇరిగేషన్ అధికారులు డిజైన్ రూపకల్పన చేశారు. సుమారు రూ.రెండు కోట్లతో 759 ఎకరాలకు సాగు నీరందించేందుకు 2000లో ఆనకట్ట నిర్మించారు. కోటశిర్లాం, కొండకెంగువ, మామిడివలస, దుప్పలపూడి, ముచ్చర్లవలస, ఆరికతోట గ్రామాల పంట పొలాలకు సాగు నీరందించాలని నిర్దేశించారు. అయితే అప్పట్లో డిజైన్ లోపం వల్ల నీరు నిల్ల ఉండని పరిస్థితి నెలకొంది. దీంతో కుడి, ఎడమ కాలువల ద్వారా చుక్క నీరు అందడంలేదు. కొండలపై నుంచి వస్తున్న నీరంతా గెడ్డ నుంచి కిందికి వెళ్లిపోతోంది. దీంతో ఆనకట్ట ప్రారంభం నుంచే ఆయకట్టుకు చుక్క నీరందడంలేదు.ఈ నేపథ్యంలో జలవనరుల శాఖ నిర్లక్ష్యం, నిర్వహణ లేకపోవడంతో ఆనకట్ట వెనుక ఇసుకమేటలు పేరుకుపోయాయి. షట్టర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. బాడీవాల్ నుంచి నీరు పైనుంచి పారడంతో ఆనకట్ట దిష్టిబొమ్మలా మిగిలిపోయింది. రెండు దశాబ్దాలుగా నిర్వహణ లేకపోవడంతో కుడి, ఎడమ కాలువలు పిచ్చిమొక్కలతో నిండిపోయి పూడుకుపోయాయి. జంగిల్ క్లియరెన్స్ చేయకపోడంతో కాలువలు పూర్తిగా మట్టి, సిల్ట్‌తో నిండిపోయాయి. మదుములు కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. కొండల్లో నుంచి ఏటా వర్షాకాలంలో వస్తున్న వేలాది క్యూసెక్కుల నీరు వృథాగా గెడ్డ ద్వారా సముద్రంలోకి పోతోందని రైతులు వాపోతున్నారు. ఆనకట్ట నిర్మాణం జరిగి 25 సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటికీ ఆయకట్టుకు సాగునీరు అందకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆనకట్ట పరిధిలో కనీసం ఒక్క లస్కర్‌నైనా నియమించలేదని రైతులు వాపోతున్నారు.ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఏడొంపుల ఆనకట్టను డిజైన్ మార్చి నీరు కాలువలకు అందేలా మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. కాగా కొద్దేళ్లుగా ఏడొంపులగెడ్డ ఆనకట్ట నిర్లక్ష్యానికి గురైందని ఇరిగేషన్ శాఖ ఏఈ హరి తెలిపారు. ఇటీవల ఆనకట్ట దుస్థితిపై బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన స్పందించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారని చెప్పారు. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామని తెలిపారు.



కొండకెంగువ వద్ద పిచ్చిమొక్కలతో పూడుకుపోయిన ఏడొంపులగెడ్డ ఆనకట్ట పరిధిలో కాలువ

మరమ్మతులకు నోచుకోక.. వినియోగంలో లేక

● నిరుపయోగంగా చేతి పంపులు ● అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వైనం ● ఇదీ వెంకటరాయుడుపేట, పెంట గ్రామాల్లో పరిస్థితి



పెంటలో నిరుపయోగంగాఉన్న చేతి పంపు

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరాయుడుపేట, పెంట గ్రామాల్లో చేతిపంపులకు మరమ్మతులు లేకపోవడంతో వినియోగానికి నోచుకోవడంలేదని దీంతో నిరుపయోగంగా మారాయి.

వెంకటరాయుడుపేటలో వంద ఇళ్ల ఉండగా ఇక్కడ ఓ బోరు ద్వారా తాగునీటిఅవసరాలు తీరుతున్నాయి.పెంటలో గ్రామంమధ్యలో ఉన్న నీటి ట్యాంకు ద్వారా కొన్నివీధులకు మాత్రమే తాగునీరు అందుతోంది. మిగతావీధులకు సంబంధించి కొళాయిలు పాడైనా మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఈ నేపథ్యంలో వేసవికాలం సమీపిస్తుండడంతో ఇక్కడ చేతిపంపులు వినియోగంలో లేకపోవడంతో ఆయా గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. అయితే ఇక్కడ బోర్లు పాడై నెలలు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోవడంలేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. చేతిపంపులు అందుబాటులోఉండే సమయంలో నీటి కొరతఉండేది కాదని, ఈవిషయంపై పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మరమ్మతులకు చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు చెబుతున్నారు. కాగా వెంకటరాయుడుపేట, పెంట గ్రామాల్లో చేతి పంపుల మరమ్మతులపై దృష్టి సారించామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రావణకుమార్ తెలిపారు. వేసవిలో నీటి సమస్య నివారణకు చర్యలు తీసుకుంటామనిపేర్కొన్నారు. చేతిపంపుల మరమ్మతులకు కావలసిన సామగ్రి అందుబాటులో ఉందని చెప్పారు.

అంగన్‌వాడీ భవనానికి రంగులు

● వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు



సాంబన్నవలసలో అంగన్‌వాడీ కేంద్రానికి రంగులు వేసిన దృశ్యం

గరుగుబిల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరుపెంట పంచాయతీ పరిధిలోగల సాంబన్నవలసలో నిరుపయోగంగా ఉన్న అంగన్‌వాడీకేంద్రం భవనం వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. గ్రామంలో లక్షలాది రూపాయల వ్యయంతో అంగన్‌వాడీ భవనం నిర్మించారు. శ్లాబుతోపాటు అవసరమైన నిర్మాణాలు పూర్తి చేసినా వినియోగించని పరిస్థితి నెలకొంది. ఈనేపథ్యంలో నిరుపయోగంగా ఉన్న ఆ భవనంపై గత నెల 17న ఆంధ్రజ్యోతిలో వినియోగంలోకి వచ్చేనా శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీంతో భవనాన్ని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు కొమరాడ ప్రాజెక్టు సీడీపీవో జి.సుగుణకుమారి తెలిపారు. కొన్నాళ్లుగా నిరుపయోగంగా ఉండడంతో గ్రామస్థులు పశువుల శాలగా ఉపయోగించిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం భవనానికి అవసరమైన రంగులు వేసి అప్పగించేందుకు చర్యలు చేపడుతున్నామని ఆమె చెప్పారు.

మోటివేటర్లగా ఉపాధ్యాయులు వద్దు

● యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

బెలగాం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఫౌండేషన్ పాఠశాల ఏర్పాటుకు మోడల్ ప్రైమరీ స్కూళ్ల ఉపాధ్యాయులను మోటివేటర్లగా నియమించవద్దని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు కోరారు.ఆదివారం పార్వతీపురంలో నిర్వహించిన యూటీఎఫ్ జిల్లాస్థాయి సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో 3,4,5 తరగతులను ఎత్తివేసి ఫౌండేషన్ పాఠశాలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఫౌండేషన్ పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని ఇచ్చి మోడల్ ప్రైమరీ పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వం పూనుకుందని చెప్పారు. యూపీ పాఠశాలలను ఎత్తివేయడానికి ఎస్ఎంసీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పించే బాధ్యత ఉపాధ్యాయులదే అని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ విజయరామరాజు చెప్పడం, తమ కళ్లను తామే పొడుచుకునేటట్లు చేయడమేనని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్, జిల్లా అధ్యక్షులు టి.రమేష్, జ్యోతి, కె.మురళి పాల్గొన్నారు.

డీఎస్సీలో ఎస్టీలకు న్యాయం చేయాలి

● ఆదివాసీ జిల్లా జేఏసీ డిమాండ్

బెలగాం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నియామకాల్లో ఎస్టీలకు న్యాయం చేయాలని ఆదివాసీ జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ (ఏజేఏసీ)నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పార్వతీపురంలోని గిరిజన భవన్‌లో ఏజేఏసీ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజేఏసీ గౌరవ చైర్మన్ నిమ్మక జయరాజు మాట్లాడుతూ ఎల్‌టీఆర్‌పై అధికారులతో పాటు ఆదివాసీలకు అవగాహన అవసరమని తెలిపారు. షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీలకు ఉద్యోగాల కల్పనకు చట్టం రూపొందించాలని కోరారు. కూటమి ప్రభుత్వం జీవో- 3 అమలు కోసం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. 1/70చ చట్టం, షెడ్యూల్ ప్రాంతాల జోలికి ఎవరైనా వస్తే ఆదివాసీలంతా ఎదురుతిరుగుతారని హెచ్చరించారు.కార్యక్రమంలో ఏజేఏసీ నాయకులు ధర్మారావు, దుక్క సీతారాం, కె.ఉదయ్, ఇ.రామకృష్ణ, ఆరిక చంద్రశేఖర్, పల్లా సురేష్, గౌరమ్మ, పారమ్మ పాల్గొన్నారు.

జనసేన కన్వీనర్‌గా శివ

గరుగుబిల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ మండల కన్వీనర్‌గా రావుపల్లి గ్రామానికి చెందిన బోను శివను ఆదివారం నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జి కడ్రక మల్లేశ్వరరావు నియామకం పత్రం అందించారు. ఉపాధ్యక్షుడిగా చినగుడబకు చెందిన అక్కేన శంకరరావును నియమించారు. జనసేన అధినేత కె.పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ అధిష్ఠానం అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తామని తెలిపారు. కాగా బోను శివ నియామకంపై పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

విద్యా వ్యవస్థ పటిష్ఠం!

(ఐదో పేజీ తరువాయి)

మార్చనున్నారు. వాటికి ఐదు స్కూల్ అసిస్టెంట్ పోస్టులను మంజూరు చేయనున్నారు. మిగతా ప్రాథమిక పాఠశాలలకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉంటారు. కొత్త విధానంలో కొన్ని ప్రాథమిక ఉన్నత పాఠశాలలు కనుమరుగయ్యే అవకాశం ఉంది.

● ప్రస్తుతం ఉన్న యూపీ పాఠశాలల్లో 6,7, 8 తరగతులవిద్యార్థులు 60మంది కంటే ఎక్కువగా ఉండి.. మూడు కిలోమీటర్ల పరిధిలో హైస్కూల్ లేకుంటే ఆ యూపీ పాఠశాలనే ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయ నున్నారు. 60 కంటే విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న యూపీ పాఠశాల విద్యార్థులను సమీప హైస్కూల్‌కు పంపించ మన్నారు. ఈ మార్పులు, చేర్పుల కోసం క్షేత్రస్థాయిలో విద్యా శాఖాధికారులు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు.

పాఠశాలలు పెరగనున్నాయి..

గతంలో కంటే జిల్లాలో హైస్కూల్స్ సంఖ్య పెరగనుంది. ఎక్కడా పాఠశాలలు ఎత్తివేసే పరిస్థితి లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నివేదికలు సిద్ధం చేస్తున్నాం.

- ఎన్.తిరుపతిరావు,
డీఈవో, పార్వతీపురం మన్యం

ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలి



మాట్లాడుతున్న వర్మ

పార్వతీపురంటౌన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి):ఆధ్యాత్మిక, సేవా మార్గంలో ప్రతిఒక్కరూ పయనించాలని వికాస తరంగిని రాష్ట్ర అధ్య క్షుడు వర్మ తెలిపారు. ఆదివారం బెలగాం కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పార్వతీపురం మన్యం జిల్లా వికాక తరంగిణి అధ్యక్షుడు ఐ.గున్నేస్ ఆధ్వర్యంలో మార్చి ఐదో తేదీన త్రిదండి చిన్నజియ్యర్‌స్వామి పర్యవేక్షణలో శ్రీరామా పాదుకా పట్టాభిషేక కార్యక్రమానికి సంబంధించి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ చిన్న జియ్యర్ స్వామి 19 ఏళ్ల తరువాత పార్వతీపురం వస్తుండడంతో పండుగలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వికాస తరంగిణి జిల్లా అధ్యక్షులు రవివర్మ, వికాస తరంగిణి సేవకులు గ్రంధి నాని పాల్గొన్నారు.

సేవాభావం అలవరచుకోండి



మాట్లాడుతున్న నేతాజీనాయుడు

వీరఘట్టం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ సేవాభావం అలవరచుకోవాలని సత్యసాయిబాబా సేవా సంస్థ పార్వతీపురం జిల్లా అధ్యక్షుడు పి.నేతాజీనాయుడు కోరారు. ఆదివారం మండలంలోని చిట్టిపుడివలస సెంటర్‌లో గల మాతృశ్రీ ఈశ్వరాంబ స్కిల్ డెవలప్‌మెంట్‌సెంటర్‌లో సత్యసాయిబాబా కన్వీనర్లు జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దాతల సహకారంతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణాన్ని నవంబరులోగా పూర్తిచేసిశిక్షణ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సత్యసాయిబాబా స్టేట్ ఐటీ కో-ఆర్డినేటర్ ఆర్.కిషోర్, పార్వతీపురం మన్యం జిల్లా వివిధ గ్రామాల నుంచి 150 మంది సమితి కన్వీనర్లు, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

● ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ



మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

బెలగాం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. ఆదివారం పార్వతీపురంలో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో 42 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు సమ్మె చేశారని, దీంతో అప్పటి ప్రభుత్వం జూలైలో వేతనాలు పెంచుతామని, డిమాండ్లను పరిష్కరిస్తామని మినిట్స్ కాపీ ఆధారంగా హామీఇచ్చినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం మినిట్స్ కాపీ అమలు చేయాలని పలుసార్లు మంత్రులు, అధికారులను వేడుకున్నట్లు తెలిపారు. హామీలు నెరవేర్చాలని సోమవారం అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద నిర్వహించనున్న ధర్నా జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

వాకర్స్ కార్యవర్గం ఏర్పాటు

పార్వతీపురంటౌన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ఆదివారం మార్నింగ్ స్టార్ వాకర్స్‌క్లబ్ మూడో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా పి.సత్యనారాయణ, ఎం. మహిపతిలతోపాటు సభ్యులతో నారాయణస్వామి ప్రమాణస్వీకారం చేయించారు. క్లబ్ ఉపాధ్యక్షుడిగా ఎం.శ్రీనివాసరావు, కోశాధికారిగా ఎం.శ్రీధర్, గౌరవాధ్యక్షులుగా జీవీఆర్ఎస్ కిషోర్, పి.పట్టా చిన్నంనాయుడు, ముఖ్య సలహాదారులుగా ఎం.రవికుమార్, వి.చిన్నారావు, కె.నాగులతోపాటు జాలీ వాకర్‌లు శివకుమార్, సత్యానంద్, మీడియా కోఆర్డినేటర్‌గా ఎస్.గౌరీశంకరరావును క్లబ్ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ 102 డిస్ట్రిక్ట్ పాస్టు గవర్నర్ జె.నారాయణస్వామి మాట్లాడుతూ నడవడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టి సమసమాజ స్థాపనలో భాగస్వాములం కావాలన్నారు.నేటి సమాజంలో అన్ని రంగాల్లో ఉన్న అన్ని వయస్సుల వారు మానసిక ఒత్తిళ్ల, ఆందోళనలకు గురయ్యే వారి సంఖ్య పెరిగిపోతోందన్నారు. ఈ కార్య క్రమంలో గున్నేష్ పాల్గొన్నారు.